సెక్చ్

# “సూపెమిరాయి జీవితం”

టేకుమళ్ల కామేశ్వరరావు

పెద్ద ఉద్యోగం నుంచి కిందమెట్టుకి దింపివేశారన్న వార్త విన్న ఘడియలో పట్టుకొన్న అతిసార వ్యాధినుంచి అనంతరావు రెండు నెలలకు గాని బయట పడలేదు. మాటలా! వెయ్యి రూపాయల జీతగాణ్ణి టక్కున అయిదు వందలకి దింపివేస్తే, స్వర్గంనుంచి అధమం త్రిశంకు స్వర్గానికేనా తోసివేసినట్లవుతుంది. ఇంకా అతను ఏకాస్త గుండెనిబ్బరం కలవాడు కాబట్టి ఏలాగో తట్టుకొన్నాడు. ప్రజలుమాత్రం అతను జీవించడం భార్య మెడలోని మాంగల్యబలంవల్లే అని స్థిరం చేశారు.

వ్యాధితగ్గినా విచారంమట్టుకు పూర్తిగా తగ్గలేదు. ఇంతకీ అతను చేసిన నేరంచూస్తే ఏమీ కనబడదు. అందులో కొంత గుమాస్తాల కుట్ర ఉందని అతని ఊహ. తగిన క్వాలిఫికేషన్ లేని కొందరు అభ్యర్థులకు ఉద్యోగాలివ్వడమే వచ్చిన అల్లరంతా! ఆకాస్త లోపానికీ ఇంత పెద్ద శిక్షా అంటాడు అనంతరావు. అది కేవలం దృష్టిభేదం! పై అధికారులు ఏదంటే అది. కి అంటె కి, క అంటే క. అదే నేరానికి పోనీలే అని ఊరుకోవచ్చు, లేక మందలించవచ్చు, లేక మెట్టు కిందికి దింపవచ్చు, ఆఖరికి బర్తరఫుకూడా చెయ్యవచ్చు. అందుచేతే మానవలోకం కొనదాకా [illegible]నవుణ్ణి విధి అనేది వెంబడిస్తూంటుందని పెల్లగుద్ది చెప్పడము. ఆటంబాంబులు కనుక్కొనియ్యండి, అంతకంటే పోటికెట్లు పెద్ద బాంబుని కనిపెట్టనియ్యండి. మానవుణ్ణి విధివశం నుంచి తప్పించ కలిగింది ఒక్కటీలేదు.

సరే, అయినదేదో అయిపోయింది. పోనీఅని ఇక ఊరుకుందామా అంటే, ఊరుకోనిస్తే కదా! మాటమాటకి పుండు రేగినట్లుగా ఏదో ఒకటి వస్తూనే ఉంటుంది. ఆ వెయ్యి రూపాయల జీతాన్ని నమ్ముకొని అనంతరావు పెద్ద మొత్తాలకి భీమా కట్టేడు. ఇప్పుడు అవివచ్చి రొమ్ముమీద కూచున్నాయి. బ్యాంకులో ఏదో కొంత ఉంది. ఇప్పటికి దానినే నమ్ముకోవలసి వస్తూంది. కాని అదైనా హరించే పద్దేకాని మరొకటికాదు.

అనంతరావు ఒక తెలివైనపనిచేసేనని సంతోషిస్తున్నాడు. మోటారుకారుని అమ్మివేశాడు. ఒక్కమాటుగా ఎదుట ఏడువేలమొత్తం కనబడింది. అదంతా లాభమే అని తలపోశాడు.

గవర్నమెంటువారు అదనంగా ఇచ్చే అధిక ధరల బత్తెం, ఇంటిబత్తెం కొంత నిష్పత్తిప్రకారం తగ్గిపోయినా. యిప్పుడు తానున్న మేడ తననిమింగే అమ్మవారిలాగు కనబడ్డది. కాబట్టి అతను వెంటనే తగుపాటి ఇంటిలోకి మారేడు కాని మేడకి అలవాటుపడ్డవాడు కాబట్టి ఈ కొత్తకొంపలో ఇరుక్కున్నట్లుగా భావిస్తున్నాడు. ఏమిచేస్తాడు. పిండికొద్దీ రొట్టె సూత్రాన్ని నెమరు వేస్తున్నాడు.

ఆ సంఘటన తర్వాత కొన్నాళ్ళపాటు పాత మిత్రులువస్తూ క్రమంగా రాకపోకలు తగ్గించేరు. ఆ ఖాళీలో కొత్తమిత్రులు ప్రవేశించేరు.

అనంతరావుకి ఇదివరకులేని కొన్ని నమ్మకాలు ఇప్పుడు బయలుదేరేయి. జాతకాలతోను, సాముద్రికాదులతోను చక్కగా కాలక్షేపమవుతూంది. ఇంతేకాదు వేదాంత గ్రంథాలు అడపతడప తిరగేస్తున్నాడు అవి నిజమైన మిత్రులలాగు కనబడ్డాయి.

ఈ మార్పులో కలిగిన కొన్ని ఉపకారాలు లేకపోలేదు. తనకి తెలియకుండానే ఇల్లాలు కొంతవరకు తోడునీడయింది. “మనకి ప్రాప్తి లేదు కాబట్టి వెనకటి వాటినిగురించి మీరు తల పెట్టవద్దు” అని ధైర్యవాక్సహాయంమాత్రమిచ్చేది. అది అంతమట్టుకే! ఆమె ఇప్పటికీ ఖర్చులలో ఏమాత్రం తేడావచ్చినా ఓర్చుకోదు. కారు అమ్మడమే బ్రహ్మాండమయింది. వెనకటి హోదాలోనే సమస్తమూ జరగాలని పట్టు బడుతుంది. ఆమెతో అనంతరావు వాగ్యుద్ధం చేస్తూంటాడు. జయాపజయంబులు దైవాధీనంబులు!

పిల్లలైనా వెనుకటి హోదాను మరిచి ప్రవర్తించలేదు. పెద్దవాడు పెద్దకారు పోతే చిన్న కారు కొనమని బలవంతం చేస్తూంటాడు. వాళ్లు

జీతంలో మార్పును అవగాహన చేసుకోలేము. అందుచేత అనంతరావు వాళ్లకి ప్రత్యేకంగా గుణపాఠాలు చెపుతూంటాడు. అతను ఇప్పటిలో ఎవ్వరికి కొత్త వస్త్రాలు కొనదలచుకోలేదు. చూసినవెల్లా కొనకూడదని ఒక కొత్త వ్రతం పెట్టుకొన్నాడు. వెనకటి పొగాకు చాకళ్లు ఇప్పుడు చాలవరకు తగ్గిపోయేయి. పని భారంవల్ల వంటలక్కను విడిచిపెట్టడానికి లేదు.

అతను మునపటికంటె శారీరక పరిశ్రమ చెయ్యవలసి వచ్చేది. ఒళ్లు కదలకుండా మోటారు కారులో పోయే మనిషి, ఇప్పుడు బస్సులమీద రిక్షాలలోను, నడకమీద వెళ్లవలసి వస్తూంది. ఇది మొదటిలో కొంత పట్టిచ్చింది. కాని క్రమంగా అలవాటయింది. అంతేకాదు ఈ పరిశ్రమవల్ల తన శరీరం మునపటికంటే దిట్టపడి, తేలిక అవుతూన్నట్టుగా గ్రహించి లోలోపల సంతోషిస్తున్నాడు.

జీవితంలో ఎగుడుదిగుడులవల్ల ఏమైనా ప్రయోజనముందా అని అనంతరావు దీర్ఘంగా తలపోశాడు. వెయ్యికి అరవెయ్యికి ఉండే తేడా బాలుడైనా గ్రహించగలడు. కాని పైపై చూపులకు అందని అంశాలు బోలెడున్నాయి. "జీతం వృద్ధి అయినకొద్దీ ప్రకృతి జీవనానికి క్రమంగా దూరమయిపోయి మనం సృష్టించుకొన్న కృతక లోకాన్నే అసలు లోకమని పొరపడుతున్నాము. ఆర్థిక దశలో మార్పువల్ల నిజమైన సౌఖ్యమిచ్చే సహజ జీవితానికి సన్నిహితమవుతున్నాం" అని అతను అభిప్రాయపడ్డాడు.

స్కెచ్

# పత్రికలు చదవేస్తే ...

వేములపల్లి శేషగిరిరావు

సాయంత్రం గోళీ లాడివచ్చి పెద్ద నేరంచేసినవానిలా తడబడుతూ యింట్లో ప్రవేశిస్తున్నాడు గోపి.

"ఇటురారా! గోపీ!" అని శాపవాక్యాలు వెదజల్లుతూ హుంకరించాడు, తండ్రి రంగనాథం యీజీచెయిర్‌లో కూర్చుండి పుస్తకం చదువుతూ.

మెల్లగాపోయి తండ్రిముందు నిల్చాడు గోపి.

"ఇక వార్తాపత్రికలు చదివావంటే చంపేస్తా"నని శాసించాడు రంగనాథం.

గోపి ముఖంలో ఆశ్చర్యం. సంతోష రేఖలు ఆవరించినయ్. అతని పెదవులపై చిరునవ్వు తాండవించింది.

ఇది అంతా వింటూనే వుంది ప్రక్క గదిలో తలదువ్వుకొంటున్న మహాలక్ష్మి. మహాలక్ష్మి రంగనాథం ధర్మపత్ని. భర్త ముఖంలోని కోపరేఖలు, కుమారుని పెదవులపైని చిరునవ్వు, భర్తగారి నవీన శాసనం మహాలక్ష్మి మనస్సును కలవరపెట్టినయ్. నవీన శాసనానికి కారణం ఆమె యెంత ఆలోచించినా అంతు దొరకలేదు.

రంగనాథం మా వూరి హైస్కూల్లో సెకండరీ గ్రేడు టీచరు. రంగనాథానికి పత్రికల పిచ్చి అధికం. సంపాదించే 70 రూపాయిల నెల జీతంలో 15 రూపాయలు పత్రికలకే ఖర్చుపెడుతూంటాడు. బాల్యావస్థనుండి పత్రికలు చదివితే పెద్ద రాజకీయవేత్త లవుతారని అతని నమ్మకం. అందుచేతనే నిత్యం బలవంతాన గోపిచే పత్రికలు చదివిస్తూ వుండేవాడు. ఇది గోపికి చాల కష్టమనిపించేది. తండ్రిమీద కోపంవచ్చేది. మనస్సులో తండ్రిని పలుపలు విధాల దూషించేవాడు. అదంతా తన శ్రేయస్సుకోసమేనని తద్ఘారం గ్రాహ్యయేలు కేమి తెలుసు? అప్పుడప్పుడు రంగనాథం పత్రికలలోని విషయాలను గురించి గోపిని టెస్టుచేస్తూ వుండేవాడు. ఒకనాడు "ఆంధ్రప్రభలోని మెయిన్ హెడ్డింగ్ యేమిటి"ని ప్రశ్నించేసరికి "లక్స్ టాయిలెట్ సోప్ అద్భుతమైన సౌందర్య సహాయిని" అని వెంటనే కుండబ్రద్దలు కొట్టినట్లు సమాధానం చెప్పాడు గోపి. రంగనాథానికి ఒళ్లు మండింది. అట్లకాడ కాల్చి చేతులమీద వాతలు పెట్టాడు. పత్రికా వ్యసనం మూలాన యిన్ని కష్టాలనుభవించే గోపికి యీ బాధ తొలగిపోతోందంటే సంతోష మెందుకుండదు? కాని రోజూ బలవంతాన పత్రికలు